# పుస్తక పరిచయం




**_Published by:_**
**_K.Padma_**
**_Kasturi Prachuranalu_**
**_Plot# 32, Dammaiguda_**
**_HYDERABAD – 500 083_**
**_Cell#: 98496 17392_**

**_Copies available at:_**
**Navodaya Book House**
**Digital Copies: kingie.com**

'**తెలుగుకథ** ఇతర భాషల కథలలా, అన్నివైపులా సమానంగా ఎదిగిన మహావృక్షంలా ఎదగలేదు. ఒకే కొమ్మ ఒకే వైపు విపరీతంగా ఎదగగా, మిగతా కొమ్మలు ఎదగక కుఱచగా ఉండిపోయిన వికృత వృక్షంలా ఎదుగుతోంది తెలుగు కథ' అని నమ్మిన రచయిత కస్తూరి మురళీకృష్ణగారు. తెలుగు కథావృక్షానికి విభిన్న శాఖలని విస్తరించే ప్రయత్నంలో లోగడ సైన్స్ ఫిక్షన్ కథలు, హిస్టారికల్ ఫిక్షన్ కథలు, కేవలం జ్యోతిశ్శాస్త్రం ఆధారంగా వ్రాసిన కథలు -- వ్రాశారు. అందులో భాగంగానే తెలుగు కథా చరిత్రలో ఇంతవరకూ రాని ప్రక్రియ భయానక కథలు (హారర్ స్టోరీస్) సంపుటిగా ఈ పుస్తకాన్ని ప్రచురించారు. ఈ పుస్తకంలోని కథలన్నీ నవ్య వారపత్రికలో హారర్ స్టోరీ శీర్షికలో ప్రచురితమయ్యాయి. ఈ సంపుటిలోని కథలన్నీ ప్రథమపురుషలోనే సాగుతాయి. అందుకు కారణాన్ని కూడ రచయిత ముందుమాటలో చెప్పారు. ప్రతికథనీ ఒక ప్రత్యేక హారర్ కథగా తీర్చిదిద్దే క్రమంలో ఆయా కథల రచన వెనుకనున్న ప్రయత్నాన్నీ. నేపథ్యాన్నీ కూడా ముందుమాటలో వివరంగా చర్చించారు.

ఆ అరగంటచాలు కథ దాదాపు ఇరవయ్యేళ్ళ క్రిందట వ్రాసినా అందులో ఉదహరించిన - అక్షరాలని తరంగాలుగా మార్చే కంప్యూటర్‌లూ, రకరకాల భాషలని అర్థం చేసుకునే కంప్యూటర్లు - రచయిత నిశితమైన ఊహాశక్తికి నిదర్శనాలు. 'ఫాంటమ్ లింబ్' కథ ఓ శాస్త్రీయ భావనకి కాల్పనిక రూపం. చదువుతున్నంతసేపూ 'అవును ఇలా జరిగితే ఎలా ఉంటుంది.? ఏదో నాటికి, ఇలా అవయవాలు కోల్పోయిన సంఘటనల్లో శాస్త్రజ్ఞులు మెదడుని నియంత్రించడం ద్వారా వాటికి కొత్త రూపాన్నిస్తారేమో..' లాంటి ఆలోచనలు పాఠకులకి వస్తాయంటే అది రచయిత కల్పనాశక్తికి గల బలమే.! అలానే మిగతా కథలు - కలకానిదీ, ప్రేయసి కౌగిలిలో, ఊర్మిళ, తెల్లపొగ - మొదలైన వన్నీ. ఏ కథ ఐనా చదువుతున్నంతసేపూ పాఠకుడి ఆలోచనల్లో ఒక విచిత్ర ప్రపంచం, సంఘటనలు రూపుదిద్దుకుంటాయి. రచయిత వ్రాసిన సంఘటనలు దృశ్యరూపంలో సాక్షాత్కరించినట్లనిపిస్తాయి. కథ ఉత్సుకతతో చివరంటా చదివిస్తుంది. చివరలో వచ్చే ఊహించని ముగింపు ఒక్కసారిగా ఒళ్ళు జలదరింప చేస్తుంది. ముగింపు వాక్యం చదివాక మళ్ళీ ఒకసారి వెనక్కు తిరిగి కథంతా చదివి, చివరి వాక్యానికి దారితీసిన సంఘటనలేమిటో మరోసారి తెలుసుకోవలనిపిస్తుంది. హారర్ కథలని తెలుగు పాఠకులకి అందించడంలో మురళీకృష్ణగారు పూర్తిగా సఫలీకృతులయ్యారని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు.

***




**భారతదేశంలోని** అన్ని రాష్ట్రాల మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లో కూడా దేవాలయాల సంఖ్య అధికమే. ఎన్నో శతాబ్దాల చరిత్ర కలిగిన అనేక దేవాలయాలు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి జిల్లాలోనూ ఉన్నాయి. చాలా దేవాలయాలకి భక్తులు, పర్యాటకులు వెళ్ళినా ఆయా దేవాలయాల చరిత్ర తెలిసిన వాళ్ళు చాలా తక్కువమంది ఉంటారు. స్థానికుల్లో కూడా చాలా మందికి ఆ దేవాలయ చరిత్ర తెలియదంటే ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఏ దేవాలయాన్నైనా, పర్యాటక ప్రదేశాన్నైనా భక్తితోనో, ఆహ్లాదంకోసమే దర్శించడం ఒక పద్ధతి ఐతే ఆయా స్థలపురాణాలని కూలంకషంగా తెలుసుకుని దర్శించడం మరో విధానం. అన్నీ తెలుసుకుని దర్శించడమో, దర్శించినపుడు అన్నీ తెలుసుకోవడమో చేస్తే ఆ జ్ఞాపకాలు మనసులో ఎప్పటికీ మిగిలిపోవడమే కాక ఆయా ప్రదేశాలని మరింత ఆసక్తితో గమనించడానికి వీలౌతుంది. సరిగ్గా ఇలాంటి ప్రయోజనాన్ని ఆశించి వ్రాసిందే పి.ఎస్.ఎమ్. లక్ష్మి గారి యాత్రాదర్శిని-వరంగల్ జిల్లా. వరంగల్, హనుమకొండ, ఖాజీపేట పరిసర ప్రాంతాలే కాక మొత్తం వరంగల్ జిల్లాలోని దాదాపు పాతిక దేవాలయాల గురించి, పర్యాటక ప్రదేశాల గురించి చక్కటి సమాచారాన్ని ఇందులో పొందుపరిచారు రచయిత్రి. రామప్ప దేవాలయం, భద్రకాళి ఆలయం లాంటి ప్రసిద్ధదేవాలయాల గురించే కాక ఎమ్.జి.ఎమ్.ఆసుపత్రి సమీపంలో ఉన్న దేవాలయం రాజరాజేశ్వరీ ఆలయం వంటి ప్రదేశాల గురించి కూడా చక్కగా సవివరంగా తెలియచేశారు. ప్రతి ఆలయం గురించి కేవలం చారిత్రక గణాంకాలనే కాక ఆయా ప్రదేశాల వెనుకనున్న కథల గురించి, కాలానుగతంగా వచ్చిన పరిణామాల గురించి చాలా ఆసక్తికరంగా వ్రాసారు. అలానే ఆయా స్థలాలకి ఎలా వెళ్ళాలో , ప్రయాణాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కూడా వ్రాసారు. సందర్భానుసారం జోడించిన ఛాయా చిత్రాలు పుస్తకానికి అదనపు ఆకర్షణగా నిలిచాయి. ఈ పుస్తకం చదువుతున్నంత సేపు ఆయా ప్రదేశాలని ప్రత్యక్షంగా దర్శించిన అనుభూతి కలుగుతుంది. సరళమైన శైలిలో సాగిన ఈ పుస్తకంలోని వ్యాసాలన్నీ లోగడ వివిధ పత్రికలలో వచ్చినవే కావడం ఒక విశేషం. ఒక మంచి ప్రయత్నం చేసి విలువైన విషయాలని గ్రంథస్థం చేసి పాఠకులకి అందించిన రచయిత్రి అభినందనీయులు.

***

***Published by:***
***P.S.M. Lakshmi***
***B 391, Sri Krishna Nagar,***
***Yousufguda, Hyderabad - 500 045***

***Copies available at:***
**Navodaya Book House**
**Vishalandhra Book House.**

**Digital Copies: kinige.com**

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**